తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఆర్థరహితం

మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు మహేశ్

కొమురవెల్లి, జూలై 22 : తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఆర్థరహితమని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. సోమవారం కొమురవెల్లిలో ఆయన మాట్లాడుతూ.. మల్లికార్జునస్వామి దర్శనం కోసం వచ్చిన తీన్మార్ మల్లన్న అభివృద్ధిపై మాట్లాడకుండా అనునిత్యం జనగామ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతూ ప్రజల్లో ఉంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డిపై, బీఆర్ఎస్ పార్టీపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. దేవుని భూముల అన్యాక్రాంతం కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, దానిలో భాగంగా గుంట భూమి లేని మల్లన్నకు సుమారు 136 ఎకరాల భూమిని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వామివారి పేరిట రిజిస్ట్రేషన్ చేసి పాస్ బుక్కులు ఆలయ ఈవోకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆదాయం లేని ఆలయాలకు దూపదీప నైవేద్యం పథకం ద్వారా అర్చకులకు గౌరవ వేతనం ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సార్ల కిష్టయ్య, కొండ శ్రీధర్, ముత్యం పరుశరాములు, మందాల బాబు, చిగురుపల్లి రాజు తదితరులు ఉన్నారు.

చేర్యాలలో సీపీఎం నిరసన

చేర్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, జూలై 22 : చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలను జనగామ జిల్లాలో కలుపుతామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జనగామ జిల్లాలో నాలుగు మండలాలను కలుపుతామని తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్నను దర్శించుకునేందుకు వచ్చిన తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి సూచనలతోనే సిద్దిపేట జిల్లాలోని ఈ నాలుగు మండలాలను జనగామ జిల్లాలో కలుపుతామని మాట్లాడారని విమర్శించారు. తీన్మార్ మల్లన్న తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శశిధర్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల సీపీఎం కార్యదర్శులు వెంకట్మావో, సత్తి రెడ్డి, యాదగిరి, ధూళిమిట్ట మండల బాధ్యుడు రవికుమార్, చేర్యాల పట్టణ కార్యదర్శి నాగరాజు, రవీందర్, ప్రశాంత్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో శిక్ష సప్తాహ

శిక్ష సప్తాహ కార్యక్రమంలో బొమ్మలు చూయిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మిరుదొడ్డి (అక్బర్పేట-భూంపల్లి), జూలై 22 : అక్బర్పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్ష సప్తాహ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా దొరికే వస్తువులతో వివిధ రకాల బొమ్మలను తయారు చేసి విద్యార్థులకు ఉపాధ్యాయులు చూపించారు. టీఎల్ఎం ఈ నెల 22 నుంచి 30వరకు ని ర్వహించనున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్, శ్రీనివాస్, రాజేశ్వరి, బాకృష్ణ, ఇందిర, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలి

- అక్కారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- బోర్డుపై విద్యార్థులచే లెక్కలు చేయించిన కలెక్టర్

అక్కారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ మను చౌదరి

గజ్వేల్, జూలై 22 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, కల్పిస్తున్న మౌలిక వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ఉపాధ్యాయులు చూడాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అక్కారం ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రాథమిక, జిల్లా పరిషత్, కేజీబీవీ, మాడల్ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులున్నాయన్నారు. విద్యార్థులు ప్రైవేటులో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మంచి వాతావరణాన్ని తయారు చేయడానికి తరచూ తనిఖీ చేస్తామన్నారు. జిల్లాలో మూతపడిన, తక్కువ సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలలపై ఎక్కువ శ్రద్ధ తీసుకొవాలన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

మండల పరిధిలోని అక్కారం ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంగా కలెక్టర్ మను చౌదరి విద్యార్థులచే తరగతి గదిలోని బ్లాక్బోర్డుపై లెక్కలు చేయించారు. విద్యార్థులు చక్కగా లెక్కలు చేయడంతో వారిని చప్పట్లు కొట్టి అభినందించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మొక్కుబడిగా భోజనం పెట్టకుండా విద్యార్థులు కూరలు కలుపుకొని తినేలా తెలుపాలని, రుచికరమైన భోజనం అందించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు మంచి నీటి నల్లా సమస్య ఉందని గమనించి కలెక్టర్ ఇంజినీరింగ్ ఏజెన్సీ బ్యాటరీ ఆఫ్ ట్యాప్ కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మొనూ ప్రకారం పిల్లలకు గుడ్లు, ఆకుకూరలు, పప్పులు తదితర పౌష్టికాహారం అందించాలని వంట సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో బన్సీలాల్, డీఈవో శ్రీనివాస్రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పారిశుధ్య పనులు చేపట్టాలి

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 22 : గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్తో కలిసి డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీవోలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ, అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ట్రాన్స్జెండర్లకు స్వయం ఉపాధిపై నైపుణ్య శిక్షణ నిర్వహించారు.జిల్లాలోని దివ్యాంగులకు సబ్సిడీ కింద మంజూరైన చెక్కులను కలెక్టర్ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన 'దాశరథి'



మాట్లాడుతున్న వీరన్నయాదవ్

హుస్నాబాద్, జూలై 22 : తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలకు తన రచనలు, పోరాటాలతో ఊపిరిలూదిన ఘనత దాశరథి కృష్ణమాచార్యదేనని పలువురు వక్తలు అన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దాశరథి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలు ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేపీసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్ మాట్లాడుతూ.. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గొప్పగా చెప్పిన వ్యక్తి దాశరథి అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగమూర్తి, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, రచయిత మల్లేశం, అయిలేశ్యాదవ్, రాజు, లక్ష్మణ్ గౌడ్, ఫ్రాన్సిస్, వీరన్న, కొమురయ్య, బాలు, శ్రీనివాస్గౌడ్, నాంపల్లి సమ్మయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య వారధి దాశరథి

సిద్దిపేట టౌన్, జూలై 22 : నా తెలంగాణ.. కోటి రతనాల వీణ అని గొంతెత్తి పాడి ప్రజలను చైతన్య పరిచిన కవి దాశరథి కృష్ణమాచార్యులు అని జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట అధ్యక్షుడు ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. సిద్దిపేటలో సోమవారం దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బాలసాహిత్య పరిషత్ రచయితలు ఉండ్రాళ్ల రాజేశం, బస్వరాజ్ కుమార్ ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో..

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, అధ్యాపకులు శ్రీనివాస్, సుదర్శనం, అయోధ్యరెడ్డి, తెలుగు విభాగం అధ్యాపకులు ఉన్నారు.

ట్రాక్టర్ యజమానులకు నోటీసులు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 22: ధూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో గత కొంతకాలంగా సాగుతున్న ఇసుక అక్రమ వ్యాపారంపై ఈ నెల 22న 'మూడు డంప్లు..ఆరు ట్రాక్టర్'లు అనే శీర్షికన నమస్తే తెలంగాణ కథనాన్ని ప్రచురించింది. కథనానికి స్పందించిన ధూళిమిట్ట తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యామ్ సోమవారం జాలపల్లి గ్రామంలోని ట్రాక్టర్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామంలో సాగుతున్న ఇసుక అక్రమ వ్యాపారంపై పత్రికల్లో వార్తలతో పాటు ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. అగ్రికల్చర్కు సంబంధించిన ట్రాక్టర్లలో ఇసుకను రవాణా చేస్తే వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

శారదాంబ పారాబాయిల్డ్ మిల్లు తనిఖీ

రైస్ మిల్లును పరిశీలిస్తున్న ఆర్డీవో బన్సీలాల్

తొగుట, జూలై 22 : మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేట శివారులోని శారదాంబ పారాబాయిల్డ్ మిల్లును గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు సేకరించిన ధాన్యం నిల్వలు, రిర్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తొగుట తహసీల్దార్ శ్రీకాంత్, వర్గల్ తహసీల్దార్ బాలరాజు, ఎస్సై రవికాంతారావు, సివిల్ సప్లై డీటీ స్వామి, ఆర్ఐ ఆశోక్రాజు పాల్గొన్నారు

గ్రీవెన్స్ సెల్లో సందేహాలను నివృత్తి చేసుకోవాలి

మిరుదొడ్డి, జూలై 22 : పంట రుణమాఫీ కాని రైతులు రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్లో సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఏవో మల్లేశం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మిరుదొడ్డి రైతు వేదిక భవనంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటిరకు ఉమ్మడి మిరుదొడ్డి మండలంలో 3,527 మంది రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేసిందని, ఆగస్టు 15వరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని తెలిపారు. నూతనంగా పట్టాపాసు బుక్కులు పొందిన రైతులు ఆగస్టు 5వరకు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏ ఈవోలు ఎ.లోహిత్, నిర్మల పాల్గొన్నారు.

స్మితాసబర్వాల్ క్షమాపణ చెప్పాలి

మిరుదొడ్డి, జూలై 22 : దివ్యాంగుల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ వెంటనే వారికి క్షమాపణ చె ప్పాలని వికలాంగుల సంఘం జిల్లా నాయ కుడు మొగుళ్ల ఐలయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగ బద్ధమైన హోదాలో ఉన్న వారే దివ్యాంగుల పట్ల ఇలా మాట్లాడడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులు రాజేశ్వర్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మిరుదొడ్డి, జూలై 22 : దివ్యాంగులను అవమాన పర్చిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి (డీబీఎఫ్) పి.శంకర్ అన్నారు. సోమవారం ఆయన మిరుదొడ్డిలో విలేకరులతో మాట్లాడుతూ.. విమానయాన, వైద్య రంగంలో ఫిజికల్ ఫిట్నెస్ లేని వారిని తీసుకుంటారా అన్ని ప్రశ్నించడం తగదన్నారు. భారత రాజ్యాంగం పట్ల గౌరవం లేని ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ ఇలా మాట్లాడడం సిగ్గు చేటన్నారు.

రేషన్ కార్డు నిబంధన తొలిగించాలి

జగదేవ్పూర్ జూలై 22 : పంట రుణమాఫీ పథకానికి రేషన్ కార్డు నిబంధన తొలిగించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తీగుల్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డు నిబంధనతో రైతులకు నష్టం జరుగుతుందన్నారు. రీషెడ్యుల్ ఉన్న కుటుంబాల్లో అర్హులైన వారం దరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, బిక్షపతి, కరుణాకర్రెడ్డి, లింగం ఉన్నారు.

జైభీం కాలనీగా గుర్తించాలి

జగదేవ్పూర్ జూలై 22 : మండల కేంద్రం జగదేవ్పూర్లోని ఎస్సీ కాలనీని జైభీం కాలనీగా గుర్తించాలని గ్రామ పంచాయతీలో పేరు మార్పించాలని జైభీం యువజన అధ్యక్షుడు మచ్చ హరీశ్ కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామ కార్యదర్శి హరిప్రసాద్కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అరుణ్, మచ్చ దినేశ్, సాయి, మచ్చ గణేశ్ పాల్గొన్నారు.

ఆరు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు కరువు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 22 : ఉమ్మడి మద్దూరు మండలంలోని ఆరు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు కరువయ్యారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు ఇటీవల బదిలీపై వెళ్లగా వారి స్థానంలో కొత్తగా ఎవరూ రాకపోవడంతో ఆరు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీ అయ్యాయి. ధూళిమిట్ట మండలంలోని బెక్కల్, కొండాపూర్, హనుమతండా, రెడ్యానాయక్తండా, దుబ్బతండా గ్రామ పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీ అవ్వగా కమలాయపల్లి పంచాయతీ కార్యదర్శి దీర్ఘ కాళిక సెలవుపై వెళ్లారు. పంచాయతీ అధికారులు స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దుబ్బాక/చిన్నకోడూరు/మర్కుక్, జూలై 22 : రైతు బీమాకు అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయా మండలాల వ్యవసాయ అధికారులు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ... 2024 జూన్ 28 వరకు వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు 18-59 ఏండ్లు ఉండాలని తెలిపారు. పట్టాదారు దరఖాస్తు ఫారంతో పాటు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్కార్డు జిరాక్స్ ప్రతులను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో)లకు అందజేయాలని సూచించారు. పంట రుణమాఫీకి సంబంధించిన ఏదైనా సమస్యలుంటే తమ ఆధార్కార్డుతో సంబంధిత ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

ఎస్సైగా రవికాంతారావు

తొగుట, జూలై 22 : తొగుట నూతన ఎస్సైగా రవికాంతారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పని చేసిన లింగంను డీఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఆర్యవైశ్య మహాసభ కమిటీ ప్రమాణ స్వీకారం

చేర్యాల, జూలై 22 : చేర్యాల పట్టణ మహాసభ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు మంచాల ఆంజనేయులు గుప్తా సమక్షంలో చేర్యాల పట్టణ ఆర్యవైశ్య మహాసభ కమిటీ అధ్యక్షుడిగా వంగపల్లి శ్రీనివాస్గుప్తా, ప్రధాన కార్యదర్శిగా ఉప్పల నాగరాజుగుప్తా, కోశాధికారిగా తేరాల శ్రీనివాస్గుప్తా, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తోట పద్మ, యువజన విభాగం అధ్యక్షుడిగా ఓరుగంటి శ్రీకాంత్గుప్తాతో పాటు ఆయా విభాగం కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

స్థానిక ఎన్నికల కోసమే రుణమాఫీ జిమ్మిక్కు

కొమురవెల్లి, జూలై 22 : స్థానిక ఎన్నికల కోసమే కాంగ్రెస్ పంట రుణమాఫీ పేరిట జిమ్మిక్కు చేస్తుందని బీజేవైఎం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొంగోని సురేశ్గౌడ్, జనగామ అసెంబ్లీ కన్వీనర్ దండ్యాల వెంకట్రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి తోకల ఉమారాణి అన్నారు. సోమవారం కొమురవెల్లి మండలంలోని కిష్టంపేట శివారులో మల్లి కార్జున ఫంక్షన్హాల్లో బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు బూర్గోజు నాగరాజు అధ్యక్షతన జరిగిన బీజేపీ కార్యవర్గ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమా, బీజేపీ నాయకులు సనాది కరుణాకర్, బ్రహ్మాండ్లపల్లి బాబు, కొయ్యడ నవీన్, కంకనాల కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్గా ఏర్పాటు చేయాలి

చేర్యాల, జూలై 22 : చేర్యాలను రెవెన్యూ డివిజన్గా ఏర్పాటు చేయాలని చేయాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మొగుళ్ల రాజిరెడ్డి కోరారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం.నరేందర్రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉడుముల భాస్కర్రెడ్డి, బాల్రెడ్డి, కూకట్ల బాలరాజ్యాదవ్, బొమ్మగాని శివయ్యగౌడ్ ఉన్నారు.

నిందితుడి రిమాండ్

సిద్దిపేట టౌన్, జూలై 22 : దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని సోమవారం రిమాండ్కు తరలించారు. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. చిన్నకోడూర్ మండల పరిధిలోని చౌడారం గ్రామానికి చెందిన వల్లేపు భాస్కర్ జల్సా జీవితానికి ఆలవాటు పడి ఐదేండ్లుగా దొంగతనాలు చేస్తున్నాడు. ఇటీవల పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా చోరీలకు పాల్పడ్డాడు. ఈ మేరకు సిద్దిపేట నెహ్రూ పార్కు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్టు చేసి రిమాండ్ చేశామని ఆయన తెలిపారు.

ఐక్యరాజ్యసమితి శాంతి సేనకు మన పిల్లోడు

వెంకటేశ్ను సన్మానిస్తున్న అజాద్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్లు

మర్కుక్, జూలై 22 : ప్రపంచంలో ఉన్న పేద దే శాల శాంతి స్థాపనకు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పనిచేసే శాంతి సేన కోసం మర్కుక్ మండలంలోని శివారు వెంకటాపూర్కు చెందిన జవాన్ బొక్కి వెంకటేశ్ ఎంపిక కావడం అభినందనీయమని రిటైర్డ్ ఆర్మీ అధికారి నీల చంద్రం అన్నారు. సోమవారం ఆయన శివారు వెంకటాపూర్ గ్రామానికి వచ్చి వెంకటేశ్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యతరగతి కుటుంబానికి చెందిన బొక్కి ముత్యాలు లక్ష్మి దంపతుల చిన్న కుమారుడైన వెంకటేశ్ దేశ సేవ చేయాలనే ఉద్దేశంతో 18 ఏండ్లలోనే ఆర్మీకి ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

వైశ్య భవన్ అధ్యక్షుడిగా బాలరాజేశం

వైశ్యభవన్ ఎన్నికల్లో విజయం సాధించిన విజేతలు

సిద్దిపేట టౌన్, జూలై 22 : సిద్దిపేట వైశ్యభవన్ ఎన్నికలు ఆదివారం రాత్రి వరకు హోరాహోరీగా జరిగాయి. అధ్యక్ష పదవి కోసం ముగ్గురు పోటీ పడ్డారు. తన సమీప అభ్యర్థి యాద శ్రీనివాస్పై అయిత బాలరాజేశం 70 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా పోశెట్టి శ్రీకాంత్, కోశాధికారిగా గంప కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా చింత రాజేంద్రప్రసాద్, కొత్తురు అశోక్, సహాయ కార్యదర్శులుగా జూలూరి శ్రీనివాస్, చకిలం రవిలు విజయం సాధించారని ఈ సందర్భంగా ఎన్నికల అధికారి జూలూరి వైకుంఠం సోమవారం తెలిపారు.

నూతన కార్యవర్గానికి సన్మానం

వైశ్య భవన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం సిద్దిపేట వాసవీ, వనితా క్లబ్ల అధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి, వీరేశం, శ్రీనివాస్, రవీందర్, బుచ్చయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజం

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న చైర్పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట, జూలై 22 : ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమని సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. సోమవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 9 మంది ఉద్యోగులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, కౌన్సిలర్లతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ.. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు మరింత ఉన్నత స్థానంలో స్థిరపడాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున్, సత్తి నాగరాజు రెడ్డి, సద్ది నాగరాజు రెడ్డి, బంగారం రాజు, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ సయ్యద్ తోపాటు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులు

సిద్దిపేట మున్సిపాలిటీ నుంచి ఇతర మున్సిపాలిటీలకు బదిలీపై వెళ్తున్న అధికారులు వీరే సిద్దిపేట హరితహారం అధికారి సామల ఐలయ్య కామారెడ్డికి, సీనియర్ అసిస్టెంట్ కిష్టయ్య కరీంనగర్కు, సీనియర్ అసిస్టెంట్ కనకయ్య మెదక్కు, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ హుస్నాబాద్కు, కే.రమేశ్ గజ్వేల్కు, మొగిలి హుస్నాబాద్కు, ఈ కలెక్టర్ సుమలత గజ్వేల్కు, మేఘమాల దుబ్బాకకు, రమేశ్ గజ్వేల్కు బదిలీ అయ్యారు.

జౌట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలి

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జౌట్ సోర్సింగ్ ఉద్యోగులు

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 22 : అన్ని డిపార్ట్మెంట్లకు సంబంధించిన జౌట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని ప్రతి నెలా అందేలా చూడాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీతాలు అందేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పొన్నాల యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల రాజమల్లు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

హుస్నాబాద్, జూలై 22: అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీల ఓట్లను దండుకునేందుకు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ విస్మరించిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం హుస్నాబాద్లోని ఐవోసీ భవనం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం డిప్యూటీ తహసీల్దార్కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీశ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకర్బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి భూశంకరాచారి, నాయకులు రాంప్రసాద్, అరుణ్, లక్ష్మయ్య, రాజేందర్, అనంతస్వామి, రవీందర్, సంతోష్, వెంకటేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ను అమలు చేయాలి

గజ్వేల్, జూలై 22: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ డిక్లరేషన్ను అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ శ్రావణ్కుమార్కు బీజేపీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆరు నెలల్లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేష